



మానుకోటలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చుని భిక్షాటన చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- టీ పీజేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ మైస శ్రీనివాస్

6




మేడారంలో ముందస్తు మొక్కులు

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల ముందస్తు మొక్కులు మొదలయ్యాయి. మినీజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం 10వేల మందికి పైగా భక్తులు మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ చీరసారెలు, కొబ్బరికాయలు, బెల్లం, యాట మొక్కులు సమర్పించారు. - మేడారం, ఆంధ్రజ్యోతి

చలికాలంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది..

- రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఎక్కువ
- సొంత చికిత్స వద్దు.. వైద్యులను సంప్రదించాలి
- ఎంజీఎం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం గౌతం

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన



'చలికాలంలో వ్యాధి నిరోధక శక్తి క్రమంగా తగ్గుతుంది. ఫలితంగా రోగాలు చుట్టుముడతాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువగా అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుంది. ఈ క్రమంలో సొంత వైద్యం పాటించకుండా వైద్యుల సలహాలతో చికిత్స పొందాలి. సమతుల్య, తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడంతో పాటు చలి నుంచి రక్షణగా పలు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మనల్ని మనం కాపాడుకోవచ్చు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు, సమస్యలున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలి' అని వరంగల్ ఎంజీఎం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం గౌతం సూచించారు. చలికాలంలో వచ్చే వ్యాధులు, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి అనేక మంది కాల్ చేయగా వారికి డాక్టర్ గౌతమ్ సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు.. పలు సందేహాలను నివృత్తి చేశారు. - వరంగల్ మెడికల్, ఆంధ్రజ్యోతి

7

అసెంబ్లీలో నారాయణపురం భూ సమస్య ప్రస్తావన

- ప్రత్యేకంగా వివరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



అసెంబ్లీలో నారాయణపురం భూసమస్యలపై మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కేసముద్రం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురంలోని భూ సమస్యను బుధవారం అసెంబ్లీలో రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అసెంబ్లీలో ఆర్‌వోఆర్ చట్టం-2024, భూమాత పోర్టల్ అంశంపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నారాయణపురంలోని 1,398 ఎకరాల గిరిజనుల భూములను గత బీఆర్ఎస్ హయాంలో 2020-ధరణి చట్టంతో తరతరాల నుంచి అనుభవిస్తున్న హక్కులను రద్దు చేస్తూ అటవీ భూమిగా పేర్కొంటూ పట్టాపాస్‌పుస్తకాలు తొలగించిందని తెలిపారు. ఆ గ్రామ బీఆర్ఎస్ ఎంపీటీసీ ధరావత్ రవి వందలమందితో అప్పటి ప్రభుత్వం దృష్టికి అనేక మార్లు తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అయినందున తన దృష్టికి ఈ సమస్యను తీసుకురావడంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. కాగా, అసెంబ్లీలో నారాయణపురం సమస్యను మంత్రి ప్రస్తావించడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తమ గ్రామ భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

డోర్నకల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



డోర్నకల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్న కాంగ్రెస్ నేత సురేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మరిపెడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీనియర్ కాంగ్రెస్ నేత ఆర్.సురేందర్‌రెడ్డి, ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ముఖ్యమంత్రిని రేవంత్‌రెడ్డిని కోరారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా వారు కలిశారు. తన సొంత గ్రామమైన మరిపెడ మునిసిపాలిటీలోని పలు కాలనీలు గత పాలకుల నిర్లక్ష్యంతో అధ్వానంగా మారాయని, ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు తదితర అభివృద్ధి నిధులు కేటాయించి, ప్రగతిపై చొరవ చూపాలని కోరారు. విన్నపానికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. వీరి వెంట ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బడి బస్సు భద్రమేనా?



మహబూబాబాద్ జిల్లాలో పాఠశాల పేరు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు

నెహ్రూసెంటర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉదయాన్నే చకచకా రెడీ అయిన చిన్నారులు భుజాన బాగ్యులు వేసుకుని బస్సు కోసం రోడ్డుపైకి పరుగులు తీస్తుంటారు. బస్సు రాగానే బడికి వెళతారు. అయితే ఈ లోపు బస్సు ఆగిపోతే.. అందులోని చిన్నారులు, ఇంటివద్ద తల్లిదండ్రులకు టెన్షన్ తప్పదు. అందుకే పాఠశాలకు పంపే తల్లిదండ్రులు తప్పనిసరిగా చిన్నారుల బస్సులు, ఆటోలు కండీషన్‌లో ఉన్నాయా..? లేవా! సరి చూసుకోవాలని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రులకు తమ పిల్లలకు ఉత్తమ విద్యను అందించాలనే ఉద్దేశంతో ఫీజుల రూపంలో రూ.వేలు ఖర్చుచేసి, ప్రైవేటు పాఠశాలకు పంపుతున్నారు. కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించకుండా పిల్లలు నిత్యం ఇంటి నుంచి పాఠశాలలు, కళాశాలకు రాకపోకలు సాగించే బడి బస్సుల సామర్థ్యంపైన దృష్టి సారించాల్సిన అవసరమ ఎంతైనా ఉంది. వీరే కాకుండా విద్యాసంస్థల యాజమాన్యాలు వాటి నిర్వహణపై జాగ్రత్తలు తీసుకుంటే విద్యార్థుల ప్రయాణం సురక్షితమవుతుంది. విద్యార్థుల ప్రయాణ విషయంలో జాగ్రత్తలతో అన్ని పత్రాలు ఉంటేనే బస్సులు రోడ్లపైకి రావాలని రవాణా శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. మహబూ బాబాద్ జిల్లాలోని 18 మండలాలకు గాను 50 నుంచి 60 పాఠశాలలకు గాను 165 బస్సులు ఉన్నాయి. ఇందులో ఎన్ని ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

పట్టించుకోని ఆర్టీఏ అధికారులు..

ప్రైవేటు పాఠశాలల బస్సులపై పాఠశాలల ప్రారంభ సమయం లో నామమాత్రంగా తనిఖీలు, ఫిట్‌నెస్ టెస్టులు చేసి ఆర్టీఏ అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇగ అప్పటి నుంచి బస్సుల తనిఖీ, ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టిన పాపాన పోలేదు. అన్ని బస్సుల ఫిట్‌నెస్ టెస్ట్ చేస్తే సగానికి సగం పనికి రాని బస్సులే దర్శనమిస్తాయని పలువురు విమర్శిస్తున్నారు. ఆర్టీఏ అధికారులు పాఠశాలల నిర్వాహకులు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి ఫిట్‌నెస్ టెస్టులు మరిచారని పలువురు విమర్శిస్తున్నారు.

లోపాలు మరెన్నో..

యాజమాన్యాలు తమ బస్సులను రవాణా శాఖ కార్యాలయాలకు పంపిస్తున్నాయి అంతే.. అధికారులు మాత్రం పక్కా ప్రణాళిక ప్రకారం చెక్ చేయాల్సి ఉంటుంది. ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ అయినట్లు అధికారులు ధృవీకరిస్తున్న 90 శాతం బస్సుల్లో కనీస నిబంధనలు పాటించకుండా ఉన్నవే ఎక్కువగా ఉన్నాయి. ఫిట్‌నెస్‌ను పరిశీలించే విధానం గతంలో కంటే కొంతమెరుగు పడినా అనేక లోపాలు న్నాయి. ప్రతీ దాన్ని స్వయంగా నడిపి పరీక్షించాలి. కానీ, ఒక్కో విద్యాసంస్థకు పదుల సంఖ్యలో వాహనాలు ఉంటే పలు రవాణా కార్యాలయాల్లో కొన్నింటినే చెక్ చేస్తున్నారు. ఎక్కువ లోపాలు ఉన్న వాటికి మాత్రం సర్టిఫికెట్లు నిరాకరిస్తున్నారు. కొన్ని అరిగిన టైర్లతో వస్తుంటే మరికొన్ని పగిలిన అద్దాలతో , కొన్ని పిల్లలు ఎక్కే మెట్లు జారేలా, ఇండికేటర్లు లేకపోవడం, రేడియం స్టిక్కర్లు లేకుండా వస్తుండడం గమనార్హం.

విద్యార్థుల తల్లిదండ్రులూ తస్మాత్ జాగ్రత్త

- జిల్లా వ్యాప్తంగా మొత్తం 165 బస్సులు
- చోద్యం చూస్తున్న ఆర్టీఏ అధికారులు



ఫిట్నెస్ లేక అదుపుతప్పి ప్రమాదానికి గురైన తొర్రూరులోని ఓ పాఠశాలకు చెందిన బస్సు (ఫైల్)

నిబంధనలు ఇవి..

- బస్సుకు ఇరువైపులా విద్యాసంస్థ పేరు, చిరునామా, ఫోన్ నంబర్ రాసి ఉండాలి
- బస్సు ఖచ్చితంగా పసుపు రంగులోనే ఉండాలి
- ప్రతీ బస్సులో ప్రథమ చికిత్స పెట్టెతో పాటు అనవరమయ్యే మందులు అందుబాటులో ఉండాలి.
- బస్సు డ్రైవర్ ఆరోగ్యవంతుడై ఉండడంతో పాటు 60 ఏళ్లకు మించి వయసు ఉండకూడదు.
- హెవీ వాహనంపై డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం ఉండాలి. డ్రైవర్ ఆరోగ్య పరిస్థితి మెరుగా ఉండాలి.
- చిన్న పిల్లలు ప్రయాణించే బస్సు లోపల విద్యార్థులను డ్రైవర్ గమనించేలా కుంభాకార అద్దం అమర్చాలి.
- ప్రతీ బస్సులో సహాయకుడు ఉండాలి.
- బస్సులో ప్రయణించే విద్యార్థుల వివరాలతో పాటు బస్సు ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉండాలి.
- అత్యవసర ద్వారాలు ఏర్పాటు చేయాలి.

"ఫిట్‌నెస్ ఉన్న బస్సులకే అనుమతి ఇవ్వాలి"



గుగులోతు సూర్యప్రకాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్

మహబూబాబాద్ జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను వివిధ గ్రామాల నుంచి స్కూల్‌కు తీసుకువచ్చేందుకు ఉపయోగిస్తున్న స్కూల్ బస్సులను ఫిట్‌నెస్ ఉండేలా సరిచూసి అనుమతి ఇవ్వాలి. ఒకే బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించవద్దు. లైసెన్స్ లేని డ్రైవర్లకు బస్సులు ఇవ్వకూడదు.

మానుకోట డీటీవోగా జైపాల్‌రెడ్డి

- హెడ్ ఆఫీస్‌కు భద్రునాయక్ అటాచ్

నెహ్రూసెంటర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జిల్లా రవాణా అధికారి (డీటీవో)గా టి.జైపాల్‌రెడ్డిని నియమిస్తూ తెలంగాణ రవాణాశాఖ కమిషనర్ మంగళవారం రాత్రి ఉత్వర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ డీటీవోగా పనిచేస్తున్న బానోత్ భద్రునాయక్‌ను హెడ్‌ఆఫీస్‌కు అటాచ్ చేశారు. ఆయన స్థానంలో వరంగల్ డీటీవోగా పనిచేస్తున్న జైపాల్‌రెడ్డిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ డీటీవో కార్యాలయంలో బుధవారం జైపాల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.



ఏఎంవీఐగా బాధ్యలు స్వీకరిస్తున్న వెంకట్‌రెడ్డి

ఏఎంవీఐగా ఎస్.వెంకట్‌రెడ్డి..

మహబూబాబాద్ అసిస్టెంట్ మోటార్ ఇన్‌స్పెక్టర్‌గా (ఏఎంవీఐ) ఎస్.వెంకట్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. 2023లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాత పరీక్షల్లో అర్హత సాధించి, మానుకోటకు తొలి పోస్టింగ్‌పై వచ్చారు. ఈ మేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

సౌత్‌వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ..

స్విమ్మింగ్ పోటీలకు నేహ



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్రంలో ఈనెల 21వ తేదీ నుంచి 29 వరకు జరిగే సౌత్‌వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ స్విమ్మింగ్ పోటీలకు మానుకోట విద్యార్థిని నేహ ఎంపికైనట్లు మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపెల్లి ఉపేంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన మొగుళ్ల నేహ హైదరాబాద్‌లోని సీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీఎంఆర్‌ఐటీ)లో సీఎస్‌సీ తృతీయ సంవత్సరం చదువుతున్నట్లుపేర్కొన్నారు. నేహ చదువుతో పాటు క్రీడల్లో రాణించటం పట్ల మా అసోసియేషన్ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నాలుగున్నర క్వింటాళ్ల

నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్‌రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం శివారు అనంతారం రైల్వేగేటు వద్ద అక్రమంగా తరలిస్తున్న నాలుగున్నర క్వింటాళ్ల నల్లబెల్లం, 10 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. కేసముద్రం మండలానికి చెందిన బాదావత్ మాన్‌సింగ్, సపావత్ సంతు, బాదావత్ సురేష్, కురవి మండల కేంద్రానికి చెందిన బానోత్ హనుమలు ముఠాగా ఏర్పడి ఇతర ప్రాంతాల నుంచి తీసుకుస్తున్నారు. అనంతారం గేటు వద్దకు రాగానే బెల్లం బస్తాలు ఉన్నాయని పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి,వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. వాటి విలువ సుమారు రూ.1.80 లక్షల వరకు ఉంటుందన్నారు. ఇందుకు బాధ్యులైన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వసతి గృహాలు, పాఠశాలల్లో.. అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వసతి గృహాలు, పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, మండల ప్రత్యేక అధికారులు నిత్యం వసతి గృహాలు, పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సూచించారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జిల్లాలోని అన్ని వసతి గృహాల, సంక్షేమ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులతో కలిసి పాఠశాలలు, వసతి గృహాల అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పతో కలిసి సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని వసతి గృహాల్లో, పాఠశాలల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, అదన పు మరుగుదొడ్ల నిర్మాణం, కాపౌండ్‌వాల్స్, చిన్నచిన్న మైనర్ రిపేరింగ్, డ్రైనేజీ సిస్టం, తాగునీరు, ఆర్వో ప్లాంట్స్, విద్యుత్ సౌకర్యాలు, డోర్స్, విండోస్‌రిపేర్‌లు, అంతర్గత పనులను వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డైట్ మెనూ చాట్‌ప్రకారం రుచికరమైన ఆహారం పిల్లలకు అందించాలని, శానిటేషన్ పక్కాగా నిర్వహించాలని, వారికి మానసిక నైపుణ్యతపై అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతీ విద్యాసంవత్సరంలో గైకాలజిస్ట్‌చే క్లాసులు నిర్వహించాలని సూచించారు. రాత్రి సమయాల్లో విద్యార్థినీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా అందించాలన్నారు. పిల్లలకు అందించే భోజనం నాసిరకంగా ఉందని తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమశాఖ, మైనార్టీ వెల్ఫేర్, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, మోడల్‌స్కూల్, అన్ని విద్యాసంస్థలు ప్రతినిత్యం విద్యార్థులను గమనించాలన్నారు. పాఠశాలల్లో ఏమైనా పెండింగ్ పనులు ఉంటే సంబంధిత అధికారులకు తెలపాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా అధికారులు పురుషోత్తం, మధుసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, నర్సింహస్వామి, కిరణ్‌కుమార్, మరియన్న, వీరభద్రం, సైదానాయక్, విజయనిర్మల, భీమ్లానాయక్, అరుణ్‌కుమార్, సుబ్బారావు, హరిప్రసాద్, వీరన్న, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్



మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలు సైబర్ నేరగాళ్ల మోసాల పట్లఅప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ బుధవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. నర్సింహులపేట మండలం, గూడూరు మండల కేంద్రాల్లో సైబర్ నేరగాళ్ల ఘరానా మోసాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ఆయా మండలాల్లో ఏఎస్సైనంటూ ఫోన్‌చేసి డబ్బులు ఫోన్‌పే చేయించుకున్న ఘటనలు చోటు చేసుకున్నాయని అన్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఏఎస్సైని మాట్లాడుతున్నాని, మాటలు కలిపి ఎస్సై కుమార్తె ఆస్పత్రిలో ఉందని, ఆరోగ్యం బాగోలేదని, వైద్యం కోసం డబ్బులు కావాలని, ఫోన్ పే చేస్తే క్యాష్ ఇస్తానని నమ్మబలుకుతున్నారని చెప్పారు. కొద్దిసేపటి తర్వాత వారికి ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుందని చెప్పారు. ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎవరూ పోలీసులని ఫోన్ చేసినా, మీ దగ్గరకు వచ్చి డబ్బులు అడిగినా వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో గానీ.. డయల్ 1930కు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

జిల్లాకు 37 మంది వార్డు ఆఫీసర్లు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలకు 37 మంది వార్డు ఆఫీసర్లను కేటాయించారు. ఇటీవల గ్రూపు-4 ఫలితాలు విడుదల కాగా, వార్డు ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు పెద్దపల్లిలో డిసెంబరు మొదటి వారంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. ఇందులో మహబూబాబాద్ జిల్లాకు 37 మందిని కేటాయించగా, వారిలో మానుకోట మునిసిపాలిటీకి- 25, డోర్నకల్‌కు-3, మరిపెడకు-4, తొర్రూరుకు-5 గురు వార్డు ఆఫీర్లను కేటాయించారు. వీరందరికి మహబూబాబాద్ మునిసిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ రవీందర్ బుధవారం జాయినింగ్ ఆర్డర్ కాపీలను అందజేశారు. వారికి కేటాయించిన మునిసిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లుగా చేరనున్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

- మృతదేహంతో ఆందోళన



బానోత్ ప్రవీణ్, మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబీకులు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి) : మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బాధితుడి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టిన ఘటన మహబూబాబాద్ మండలం దర్గాతండ శివారు లాక్యతండాలో బుధవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. లాక్యతండాకు చెందిన బానోత్ ప్రవీణ్ (25) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 17న అదేతండాకు చెందిన గుగులోతు ప్రశాంత్ ఆటోను ఖమ్మంకు కిరాయికి తీసుకుని వెళ్లాడు. ఈ క్రమంలో ప్రశాంత్ బంధువులైన కురవి మండలం బంచరాయితండాకు చెందిన అమ్ములు, అతడి వరుసకు బామ్మర్ధి వసంత్‌ను ఎక్కించుకుని బయ్యారం, గార్ల, డోర్నకల్ మీదుగా ఖమ్మంకు వెళ్తున్నాడు. లింగాల గ్రామశివారులోకి రాగానే డోర్నకల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న బొలేరో ఆటోను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది ఈ ఘటనలో ప్రవీణ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని ప్రవీణ్ కుటుంబసభ్యులకు తెలుపకుండా మంగళవారం సాయంత్రం వరకు గోప్యంగా ఉంచాడు. ప్రవీణ్ చనిపోయినా తమకు ఎందుకు చెప్పలేదంటూ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా బలవంతంగా తన కుమారుడు ప్రవీణ్‌ను ఎందుకు తీసుకువెళ్లాడని, తన చావుకు గుగులోత్ ప్రశాంత్ కారణమని, తమకు న్యాయం చేసే వరకు మృతదేహాన్ని తీసేది లేదని 3 గంటల పాటు ఆందోళన నిర్వహించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని ప్రశాంత్ కుటుంబసభ్యులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి, ప్రవీణ్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య దివ్య, ఇద్దరు కుమార్తెలు లారాగ్రేస్, సాత్విక ఉన్నారు.

ఆలయాలకు జియో ట్యాగింగ్ చేస్తాం..

దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రాయల సునీత



ముఖాముఖి

ఆంధ్రజ్యోతి: దేవాలయాలకు జియో ట్యాగింగ్ అంటే?

కమిషనర్: జియో ట్యాగింగ్ అంటే కాకతీయ రాజులు నిర్మించిన దేవా లయాలు.. వాటి చరిత్ర, విశిష్టతను గూగుల్ మ్యాప్‌లో అప్‌లోడ్ చేయడం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నారా?

కమిషనర్: ఉమ్మడి జిల్లాలో దేవాలయాల భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే పరకాల డివిజన్‌పైలెట్ ప్రాజెక్టుగా 250ఎకరాలకు హద్దులు పెట్టాం.

ఆంధ్రజ్యోతి: కోర్టు కేసుల్లో ఎన్ని ఎకరాలున్నాయి?

కమిషనర్: వంద ఎకరాలు కోర్టు పరిధిలో ఉన్నాయి. ఎప్పటికైనా ఆ భూములు దేవాలయాలకే చెందుతాయి.

ఆంధ్రజ్యోతి: రాయపర్తి మండలం సన్నూర్ దేవాలయానికి చెందిన 899ఎకరాల కౌలు వస్తోందా?

కమిషనర్: రావడం లేదు. దీంతో దేవాలయంలో ధూప, దీప, నైవేద్యానికి సైతం కష్టతరంగా మారింది. దీనిపై కలెక్టర్ సమక్షంలో రైతులతో సమావేశం నిర్వహించాం. మళ్లీ సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: మేడారం మినీ జాతరకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయా ?

కమిషనర్: ఫిబ్రవరిలో జాతర ఉన్నందున అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

ఆంధ్రజ్యోతి: కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ఎప్పుడు ?

కమిషనర్: 2025 మేలో కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలుంటాయి. ఇప్పటికే దేవాదాయ శాఖ మంత్రి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ప్రసాదానికి ఏ నెయ్యి వాడుతున్నారు ?

కమిషనర్: అన్ని దేవాలయాల్లో ప్రసాదాలకు విజయ డెయిరీ నెయ్యిని వాడుతున్నాం. ఈ విషయంలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఆంధ్రజ్యోతి: మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా ?

కమిషనర్: ఉమ్మడి జిల్లాలో ఈవో స్థాయి అధికారులు 25 మంది అవసరం కాగా, ప్రస్తుతం 16 మందే ఉన్నారు. కింది స్థాయి సిబ్బంది కొరత కూడా ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

- వరంగల్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీపీజేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ మైస శ్రీనివాస్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గత ఇరవై ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) రాష్ట్ర కో-కన్వీనర్ మైస శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల విద్యావనరుల కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి హైమా ఈనెల 17న గుండెపోటుతో మృతి చెందగా, ఆమె ఆత్మకుశాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి గాంధీసెంటర్, నెహ్రూసెంటర్‌లో మానవహారం చేపట్టారు, అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చుని బిక్షాటన చేపట్టారు. ఉద్యోగుల సమ్మెకు మైస శ్రీనివాస్ సంఘీభావం ప్రకటించి, మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగుల వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఇరవై సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో జీవితాన్ని గడుపుతున్నారని, ఇప్పటికైనా ప్రజాప్రభుత్వం వీరి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్తున్న చిరుద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులకు గార్ల మండల ఉపాధ్యాయుల సహకారంతో భోజన సదుపాయం కల్పించారు. ఈ సమ్మెకు తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం బాధ్యులు సంఘీభావం ప్రకటించారు. మహిళా ఉపాధ్యాయులు చంటి పిల్లలతో సమ్మెలో పాల్గొనగా ఒక చిన్నారి డప్పులు కొట్టడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. సమ్మెలో వీరన్న, భాస్కర్, మంజుల, ఉదయ్, బాబులాల్, రవీందర్, నవీన్, విజయలక్ష్మీ, ఉమ, సరస్వతి, భవాని, గణేష్, సాగర్, ఉప్పలయ్య, వీరన్న, వీరస్వామి, ప్రభావతి, బిందు, రాజశ్రీ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో మానవహారం నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు



భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భూపాలపల్లి జిల్లాలో..

భూపాలపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి): బతుకమ్మలతో ఆడుకుంటూ వంటా వార్పు చేసి సమగ్ర శిక్షా ఉద్యోగులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి సేవాలాల్ సేనా నాయకుడు, ఎంఈవో దేవానాయక్ మద్దతు పలికారు. తమ న్యాయమైన డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో..

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ జిల్లాకేంద్రంలో సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ముందుగా ఖమ్మం జిల్లాలో డేటా ఎంట్రీ ఆపరేటర్ హైమావతి మంగళవారం మృతిచెందినందున ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి సమ్మెకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, సీపీఎం ములుగు మండల కార్యదర్శి గఫూర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు ఎమ్డీ.సద్దాంహుస్సేన్‌లు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ సమ్మెలో సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి పాడియా కుమార్, ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఫిరోజ్, మహిళా అధ్యక్షురాలు జీవనప్రియ, సభ్యులు సుజాత, రమేష్, స్వాతి, అనిత, ప్రవీణ్ పాల్గొన్నారు.

జనగామ జిల్లాలో..

జనగామ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ ముందు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు బుధవారం 9వ రోజుకు చేరుకున్నాయి. గౌరవ ముఖ్యమంత్రి చాయ్ తాగే సమయంలో మా డిమాండ్ నెరవేరుస్తామన్న హామీని నెరవేర్చాలని కోరుతూ జనగామ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు శిబిరం వద్ద టీస్టాల్ ఏర్పాటు చేసి ప్రజలందరికీ టీ పోస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు తాడూరి రమేష్, దయాకర్, రవీందర్‌రెడ్డి, శ్రీలత, రొయ్యల రాజు, గిరి, రాజ్‌కుమార్, బాకీ వెంకటేశ్వర్లు, శివకుమార్, నర్సింహులు, పుష్పలత, బుర్ర యాకస్వామి, బాలాజీ, హరిప్రసాద్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



జనగామలో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

చలికి తట్టుకోలేక..
తనువు చాలించిన మహిళ



తూర్పాటి బుచ్చమ్మ మృతదేహం

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత తట్టుకోలేక ఓ మతి స్థిమితం లేని ఓ మహిళ తనువు చాలించింది. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. కాటారం మండలంలోని పాతరుద్రారం గ్రామానికి చెందిన తూర్పాటి బుచ్చమ్మ (58)కు గత కొంతకాలం నుంచి మతిస్థిమితం సరిగ్గా ఉండటంలేదు. ఈ క్రమంలో భూపాలపల్లి పట్టణంలో ఒంటరిగా తిరుగుతూ స్థానికులు ఇచ్చే ఆహారం తింటూ పట్టణంలోని బస్టాండ్ పక్కన నిర్మాణం చేపట్టిన పండ్ల దుకాణ సముదాయంలో తలదాచుకుంటోంది. ఈ క్రమంలో నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో ఆరు బయట తలదాచుకుంటున్న ఆ మహిళా పండ్ల దుకాణ సముదాయం పక్కన స్పృహలేకుండా పడిఉండటాన్ని బుధవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు అక్కడకు చేరుకొని ఆమె వివరాలను తెలుసుకొని కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతురాలి భర్త శంకర్ కొన్నేళ్ల కిందటే మృతి చెందగా.. సిరొంచ మండలంలోని రంగయ్యపల్లిలో నివాసముండే ఆమె కుమార్తె టేకం రాధిక, అల్లుడు రాజబాపులు వచ్చి ఆమె మృతదేహాన్ని స్వగ్రామమైన పాతరుద్రారానికి తీసుకెళ్లినట్టు పోలీసులు తెలిపారు.

గార్ల ఎస్సైగా రియాజ్ పాషా బాధ్యతల స్వీకరణ



గార్ల డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గార్ల ఎస్సైగా రియాజ్ పాషా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా ఏడాది పాటు పనిచేసిన జీనత్‌కుమార్ జిల్లా కేంద్రంలో ఎస్పీ ఆఫీస్‌కు బదిలీకాగా, మహబూబాబద్‌లో పని చేసిన రియాజ్ పాషా ఇక్కడి వచ్చారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

- పక్కా సమాచారం సేకరించి, నివేదిక సిద్ధం చేయాలి
- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



బొడ్డుగొండలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

గూడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. బొడ్డుగొండ, అయోధ్యపురంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన ప్రకారమే సిబ్బంది సర్వే నిర్వహించాలన్నారు. పక్కా సమాచారం సేకరించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా వేగంగా సర్వే జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారుల వివరాలు సేకరించి ఇందిరమ్మ కమిటీ సభ్యులను భాగస్వాములను చేస్తూ నిబంధనల ప్రకారం.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇళ్లను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం దామెరవంచ జీసీసీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అయోధ్యపురం, దామెరవంచ, గూడూరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆశ్రమ హైస్కూల్, గిరిజన బాలుర గురుకులంలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భోజన మెనూను ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరస్వామి, తహసీల్దార్ శ్వేత, కార్యదర్శి శేఖర్, ఏవో అబ్దుల్ మాలిక్, ఆర్ఐ మల్లయ్య పాల్గొన్నారు.



బాబుకు బ్యాడ్జ్ తొడుగుతున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

సీపీకి కృతజ్ఞతలు తెలిపిన పీసీ

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఘన్‌పూర్ ఏసీపీ కార్యాలయంలో కొన్ని ఏళ్లుగా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లెపాక బాబు ఇటీవల పదోన్నతి పొందారు. బాబు బుధవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్‌ఝాను అయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పదోన్నతి కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ బాబుకు హెడ్‌కానిస్టేబుల్ పదోన్నతి బ్యాడ్జ్‌ను తొడిగి అభినందించారు.

పదే పదే డయల్ 100కు ఫోన్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

జోర్నకల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి పదేపదే డయల్ 100కు ఫోన్‌చేసి, పోలీస్‌ల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేష్‌నాయక్ తెలిపారు. బుధవారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం. తెల్లబండతండాకు చెందిన గుగులోతు భాస్కర్ అనేవ్యక్తి మద్యం సేవించి డయల్ 100కు పదేపదే ఫోన్‌చేస్తూ ఏమి మాట్లాడకుండా ఉంటున్నాడని చెప్పారు. దీంతో పోలీసుల విధులకు ఆటంకం కలిగించి వారి సమయాన్ని వృథా చేసినందుకు గాను అతడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అత్యవసర సమయాల్లో మాత్రమే ప్రజలు డయల్ 100కు ఫోన్ చేయాలని చెప్పారు. పోలీసుల సమయాన్ని వృథా చేయొద్దన్నారు.



నిందితుడు భాస్కర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మినీ జాతర పనులు ప్రారంభం

మేడారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మల మినీజాతరకు తరలి వచ్చే భక్తుల సౌకర్యాల పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. 2025 ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మేడారంలో జరగబోయే మినీజాతర (మండె మెలుగు) పండుగకు తరలి వచ్చే భక్తుల సౌకర్యాలలో భాగంగా క్యూలైన్లలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ముందస్తుగా తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టినట్లు దేవాలయ కార్య నిర్వహణాధికారి రాజేంద్రం తెలిపారు. ఈ క్రమంలో పారిశుధ్య పనులను జిల్లా పంచాయితీరాజ్ అధికారి దేవరాజ్ పరిశీలించారు. వస్తున్న భక్తులకు గద్దెల పరిసరాల్లోని మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని కార్యదర్శి సతీష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



క్యూలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

ఆదర్శనీయుడు.. అంబేద్కర్

- చల్లగరిగలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- అంబేద్కర్ విజ్ఞాన మందిరం ఏర్పాటు చేయాలి : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

చిట్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆదర్శనీయుడని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని చల్లగరిగలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే సత్యనారాయణరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, ప్రొఫెసర్ కంచ ఐలయ్య బుధవారం హాజరయ్యారు. ముఖ్య అతిథులకు డప్పుచప్పుళ్లు, బంతి పూలు, కోలాటాలతో మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేయడం అదృష్టంగా బావిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కుతో పాటు రాజకీయ, ఉద్యోగ అవకాశాలు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అన్నారు. యువత అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుతోనే పండుగ కాదు, విశ్వమేదావి కోట్లాది మంది ప్రజల జీవితాలను తన మేథో సంపత్తితో సమూలంగా మార్చిన మహనీయుడిని సత్కరించడం అభినందనీయమన్నారు.

ఆయన ఆలోచనలను నివృత్తి చేసుకుని అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి. అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రతీ కుటుంబంలో చర్చించాలి అప్పుడే మార్పు వస్తుందన్నారు. అంబేద్కర్ విజ్ఞాన మందిరం ఏర్పాటు చేయాలన్నారు. చదువుతోనే కుటుంబాల ఆర్థిక వ్యవస్థలు మెరుగవుతాయని తెలిపారు. ఆగర్భ శ్రీమంతులు, ఉన్నత కుటుంబాల పిల్లలకు సీట్లు వచ్చే ఢిల్లీ యూనివర్సిటీలో మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన గిరిజన బాలికలకు సీట్లు వచ్చాయి.. అదీ చదువు, ప్రతిభకు ఉన్న కొలమానమన్నారు.

ప్రొఫెసర్ కంచ ఐలయ్య మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నతంగా బతకాలన్నారు. అంటరానితనాన్ని పారద్రోలాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పసునూరి రవీందర్, కొల్లూరి భరత్, నలిగంటి శరత్, సినీగేయ రచయిత మిట్టపల్లి సురేందర్, బోడ డిన్న, రాజు నాయక్, సందీప్, కన్నం సునీల్, అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్, చిత్రంలో కంచె ఐలయ్య, ఎమ్మెల్యే జీఎస్సార్

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

తాడ్వాయి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ములుగులో జిల్లాస్థాయి సీఎంకప్ పోటీలు జరగగా మండల విద్యార్థులు సీనియర్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో తుల రవి, అథ్లెటిక్స్ ఇన్‌చార్జి ఆదినారాయణలు వారికి గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ బలుగూరి వేణు, పీఈటీల సంఘం అధ్యక్షుడు గుండెబోయిన మల్లయ్య, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల నుంచి శబరిమలకు ప్రత్యేక బస్సు



శబరిమలకు వెళ్తున్న బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ స్వాతి

జనగామ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవరుప్పుల నుంచి శబరిమలకు వెళ్తున్న స్పెషల్ బస్సు సూపర్ లగ్జరీ బస్సుకు బుధవారం జనగామ డిపోలో మేనేజర్ ఎస్.స్వాతి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ బుధవారం ప్రారంభమైన బస్సు దేవరుప్పుల నుంచి శ్రీశైలం, మహానంది, కాణిపాకం, గురువాయర్ మీదిగా పంబా శబరిమలైకు చేరుకుంటుందని తెలిపారు. దైవ దర్శనం అనంతరం శ్రీరంగం, అరుణాచలం, కంచి, తురుత్తని, శ్రీకాళహస్తి, తిరుపతి, విజయవాడ ద్వారా చేరుకోని ఈనెల 24న దేవురుప్పుల చేరుకుంటుదని తెలిపారు. అయ్యప్ప స్వాములకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లతో అదనపు ఆదాయం పొందాలి

వాజేడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి, పెద్దగొల్లగుడెంలలో ఉన్న 95 మంది లబ్ధిదారులకు పెరటికోళ్లను బుధవారం పంపిణీ చేశారు. పీవీ నరసింహరావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం-పశు పరిశోధన క్షేత్రం మామునూరు ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలో భాగంగా రెండు గ్రామాలకు చెందిన పెరటి కోళ్లతో పాటు, కోళ్ల పెంపకానికి అవసరమయ్యే దాణా, నీటితొట్టెలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆఫీసర్ ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ అమరేశ్వరి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికా రి డాక్టర్ కొమురయ్య, పశువైద్యాధికారి డాక్టర్ నరసింహులు, డాక్టరు శ్రీనిధి, అసిస్టెంట్ కుమారస్వామి, ఖాజాఖాన్‌లు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

పెద్దవంగర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమవంతు సహాయ సహకారాలు అందించే తత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈవో బుదారపు శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం ఆర్రోజు విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఆర్‌సీ తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు క్రీడా సామగ్రి, వృద్ధులకు దుప్పట్లను అందజేశారు.

ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులను గౌరవించడంతో పాటు వారిని ఆదరించాల్సిన బాధ్యత సమాజంలోని అందరిపై ఉందన్నారు. బడుగు బలహీన వర్గాలకు ప్రజలకు, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న చిక్కాల సతీష్‌ను అభినందించారు.

సీఐ కార్యాలయం తనిఖీ

పాలకుర్తి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. డీసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు ఫిర్యాదు చేస్తే స్పందించాలని, వారికి సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలోని యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. విధులకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలుంటాయని అన్నారు. ఆయన వెంట ఏసీపీ నర్సయ్య, సీఐ మహేందర్‌రెడ్డి ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ, చిత్రంలో ఏసీపీ నర్సయ్య

అలసట తెలియని సేవకుడు



అనంతారంలో గుడుంబా నివారణ ర్యాలీలో కిషన్‌నాయక్ (ఫైల్)



ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గొమాంగో నుంచి ఉత్తమ సామాజిక సేవ అవార్డు అందుకుంటున్న కిషన్‌నాయక్ (ఫైల్)

- నాలుగు దశాబ్దాలుగా నిరుపేదలకు చేయూత
- గుడుంబా, బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్న రిటైర్డ్ టీచర్
- వేతనం, పెన్షన్‌లో సగం సేవలకే ఖర్చు చేస్తున్న గుగులోతు కిషన్

స్ఫూర్తి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆయన ఓ రిటైర్డ్ టీచర్. మారుమూల తండాలో జన్మించి.. ఉన్నత చదువులు చదివి ఉపాధ్యాయుడిగా పనిచేశారు. చిన్ననాటి నుంచే తండ్రి నుంచి సేవా వారసత్వాన్ని అందుకున్న ఆయన చదువుకోవడం, విద్యాబోధనే కాకుండా సామాజిక సేవా గుణాన్ని అలవర్చుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా అలసటనేది లేకుండా సామాజిక సేవను కొనసాగిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు గుగులోతు కిషన్‌నాయక్. ఉపాధ్యాయుడి పని చేసినప్పుడు వేతనం.. పదవీవిరమణ పొందాక వస్తున్న పెన్షన్‌లో సగభాగం సేవా కార్యక్రమాలకే ఖర్చు చేస్తున్నారు. తనకు తోచిన మేరకు నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, పరీక్ష సామగ్రి, దుస్తులను అందిస్తున్నారు. మహబూబాబాద్ పట్టణ శివారు బాబునాయక్ తండాకు చెందిన హతిరాంనాయక్, కైకబాయి పెద్ద కుమారుడైన గుగులోతు కిషన్‌నాయక్ చిన్నతనం నుంచే తన తండ్రి హతిరాం నుంచి సేవా గుణాన్ని అలవర్చుకున్నారు. విద్యార్థి దశనుంచే వామపక్ష భావజాల సంఘాల్లో పనిచేసిన ఆయన సమాజంలో జరిగే అనేక అన్యాయాలపై జరిగిన పోరాటాల్లో పాలుపంచుకున్నారు. దోపిడీ లేని సమాజ నిర్మాణం కోసం పని చేసిన ఆయన 1989 సెప్టెంబరు 6న ఉపాధ్యాయ వృత్తిలో చేరారు.



విద్యార్థులకు ఆల్ ఇన్‌వన్ గైడ్, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను అందజేస్తున్న కిషన్‌నాయక్ (ఫైల్)

గుడుంబా, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సులు

నాలుగు దశాబ్దాలుగా కిషన్‌నాయక్ అనేక సేవా కార్యక్రమాల ను నిర్వహిస్తూ వస్తున్నారు. 1982 లో గిరిజన విద్యావంతుల సిండికేట్, 1990 సంవత్సరంలో గిరిజన సామాజిక చైతన్య వేదికను స్థాపించి మహబూబాబాద్ జిల్లాలోని తండాల్లో గుడుంబా నివారణ, బాల్యవివాహాల నిర్మూలనకు సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. అంతే కాకుండా పర్యావరణ పరిరక్షణ, ఎయిడ్స్ నిర్మూలన, విద్యాప్రాముఖ్యతపై దాదాపు 500వరకు సదస్సులు నిర్వహించారు. తండాలు, పల్లెల్లో బడి బయట ఉండే బడీడు పిల్లలు వారిని బడిలో చేర్పించారు. నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, దుస్తులను పంపిణీ చేశారు. ఇప్పటికి వరకు సుమారుగా 6 వేల మంది విద్యార్థులకు తన వంతు సాయం అందించారు.

1990, 1999లో గిరిజనుల జీవన స్థితిగతులపై 450 గిరిజన తండాల్లో అధ్యయనం చేసి, నాటి ప్రభుత్వాలకు నివేదికలను అందించారు. ఎక్కడ ఉపాధ్యాయుడిగా పని చేస్తే ఆ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసేవారు. 2022లో జిల్లాలోని పలు మండలాల్లో విద్యా అవగాహన సదస్సులు చేపట్టి విద్య ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. దళిత కాలనీలు, గిరిజన తండాలు, ఆదివాసీ గూడాల్లో అంబేద్కర్, పూలే ఆలోచన విధానంపై చైతన్య సదస్సులను నిర్వహించి మహనీయుల గొప్పతనాన్ని చాటి చెప్పారు. తనకు వచ్చే వేతనంలో సగం సామాజిక సేవకే ఖర్చు చేసేవారు. దివ్యాంగులు, అనాథలకు దుస్తులు, దుప్పట్లు అందించి తనవంతు సాయమందించారు.

భావితరాలకు మహనీయుల జీవిత చరిత్రలు

దేశంలో దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడ్డ మహనీయులు జీవిత చరిత్రలను భావి తరాలకు తెలియజేయాలనే సంకల్పంతో వారి జీవితచరిత్ర పుస్తకాలను అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు కిషన్‌నాయక్ పంపిణీ చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలే, పెరియార్, సాహుమహారాజ్, సేవాలాల్ మహారాజ్ లాంటి వారి చరిత్ర కనుమరుగు కావొద్దనే లక్ష్యంతో సొంతంగా పుస్తకాలు కొనుగోలు అందజేస్తుంటారు. ఆ మహనీయుల జయంతి, వర్ధంతుల రోజు సదస్సులను ఏర్పాటు చేస్తూ, వారు చేసిన సేవలను ప్రజలకు తెలియజేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 30న ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఆయన సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. అందుకోసం ప్రస్తుతం తనకు వస్తున్న పెన్షన్ నుంచి సగం కేటాయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

చలికాలంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది..



- రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఎక్కువ
- సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించాలి
- ఎంజీఎం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం గౌతం

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

వరంగల్ మెడికల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చలికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సహజంగానే వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందని ఫలితంగా రోగాల బారిన పడాల్సి వస్తుందని వరంగల్ ఎంజీ ఎం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం గౌతం సూచిం చారు. చలికాలంలో వచ్చే వ్యాధులు, చికిత్స, తీసుకో వాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి అనేక మంది కాల్ చేయగా వారికి డాక్టర్ గౌతమ్ సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు.. పలు సందేహాలను నివృత్తి చేశారు.

● ప్రయాణంలో ముక్కు కారడం, తుమ్ములు వస్తుంటాయి?

భూక్య శ్రీనివాస్, నరసింహారావుపేట, మహబూబాబాద్ జిల్లా

డాక్టర్ : సాధారణంగా ప్రయాణం చేసే సమయంలో దుమ్ము ధూళి వల్ల ముక్కు కారడం జరుగుతుంది. ముక్కులో నుంచి రక్తం కారినట్లు అనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. లేదంటే ప్రయాణం చేసే సమయంలో మాస్క్ ధరించాలి. తరుచూ ముక్కును శుభ్రం చేసుకోవడం వల్ల ఈ సమస్యను అధిగమించవచ్చు.

● చర్మంపై దురతోపాటు జలుబు తగ్గడం లేదు?

సింగు లక్ష్మీనారాయణ, దామెరమెంట్ల, కాటారం మండలం, భూపాలపల్లి జిల్లా

డాక్టర్: జలుబు పూర్తిగా తగ్గకపోతే సైనసైటిస్‌గా అనుమానించవచ్చు. ఎక్స్‌రే, సిటీ స్కాన్ చేసి వ్యాధిని నిర్ధారించొచ్చు. చర్మంపై దురదను నివారణకు మాశ్చరైసర్ లేపనాలను వాడాలి.

● దగ్గు, గొంతు నొప్పితో పాటు కండరాల నొప్పి ఉంటుంది?

గోదాసి అశోక్ కుమార్, ధర్మారం, గీసుగొండ మండలం, వరంగల్ జిల్లా

డాక్టర్: చలికాలంలో సర్వసాధారణం. రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల సంభవిస్తుంది. గొంతు నొప్పికి వైద్యుడి సలహా మేరకు యాంటీబయాటిక్ వాడటం వల్ల అధిగమించవచ్చు. కండరాల నొప్పులు అన్ని కాలాల్లో ఉంటే వైద్యులను తప్పకుండా సంప్రదించాలి.

● నా భార్యకు శ్వాస ఇబ్బంది.. గొంతు, ముక్కు మూసుకపోయినట్లు అనిపిస్తుంది.

సప్పిడి రాము, ఏటూరునాగారం

డాక్టర్: చలి తీవ్రత పెరగడంతో సాధారణంగా ఇలాంటి లక్షణాలు పెరుగుతాయి. ఇలాంటి వాటిని అధిగమించడానికి హ్యూమెడిపయర్ కూడా అందుబాటులో ఉంది. లేదంటే సాధారణ కుక్కర్లు విజిల్స్ వచ్చే వరకు ఉంచి నిద్రించే గదిలో ఉంచడం వల్ల గాలిలో తేమ శాతం పెరుగుతుంది. వీటికితోడు చేతులకు, కాళ్లకు గ్లౌజులు, మంకీ క్యాప్ వాడాలి.

● గురుకులాలు, వివిధ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు చర్మ వ్యాధులతో పాటు వైరల్ ఫీవర్ వస్తున్నాయి?

నరేశ్, ఏబీఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు

డాక్టర్: చలికాలంలో సహజంగా ఇమ్యూనిటీ తగ్గడం వల్ల వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా హాస్టల్ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను తప్పకుండా పాటించాలి. కొబ్బరినూనె లాంటివి వాడటం వల్ల చర్మ వ్యాధులను అధిగమించవచ్చు. జ్వరాల తీవ్రత పెరిగితే తప్పకుండా వైద్యులను సంప్రదించాలి.

● కడుపు ఉబ్బరంగా ఉంటుంది. తేలికపాటి ఆహారం తీసుకున్నా జీర్ణమైనట్టు అనిపిస్తలేదు?

అడువాల రత్నాకర్, గోపాల్‌పూర్, హనుమకొండ

డాక్టర్: చలికాలంలో చాలా తక్కువ తేలికపాటి ఆహారం తీసుకోవడం ఉత్తమం. నాలుగు గోడల మధ్య శారీరక వ్యాయామం చేస్తే ఈ పరిస్థితిని అధిగమించవచ్చు. ఎప్పటికి ఇలాగే ఉంటే తప్పకుండా వైద్యులను సంప్రదించాలి.

● ఆకలి కావడం లేదు

తడూరి శ్రీదేవి, విజయగణపతి నగర్, హనుమకొండ

డాక్టర్: చలికాలంలో సహజంగా ఆకలి మందగిస్తుంది. శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఆకలి అయినట్లు అనిపించదు. తేలికపాటి ఆహార పదార్థాలను తీసుకోవడం ఉత్తమం. వేడి పదార్థాలు మాత్రమే భుజించాలి. రాత్రి 7 గంటల్లోపు మాత్రమే తినాలి. మధ్యాహ్న భోజనం కూడా సాధ్యమైనంత త్వరగా చేయాలి. సమయపాలన పాటించడం వల్ల వీటన్నింటినీ అధిగమించవచ్చు.

● చలికాలంలో శ్వాస ఇబ్బంది తలెత్తుతుంది?

వీరమల్ల శ్యామ్, కరీమాబాద్, వరంగల్

డాక్టర్: చలికాలంలో శ్వాస ఇబ్బందులు తలెత్తడం సహజం. కానీ సైనోసైటీస్ సమస్య అయితే మాత్రం వైద్యులకు చూపించాలి. ముక్కుకు మాస్క్ పెట్టుకోవడం తప్పనిసరి.

పల్లెల్లో పట్నాల సందడి

మల్లన్నకు ఘనమైన మొక్కులు



వెంకటాపూర్‌లో మల్లన్న పెళ్లికి వేసిన పట్నం

ఆచారం



మల్లన్నకు నైవేద్యం సమర్పించే ప్రతిమలు

గ్రామగ్రామాన మల్లన్న పట్నాల సందడి కనిపిస్తోంది. ప్రతీ ఏడాది డిసెంబరు, జనవరి మాసాల్లో కొమురవెల్లి మల్లన్న పండుగ ప్రారంభమవుతుంది. ఈ క్రమంలో బుధవారం పలు గ్రామాల్లో మల్లన్న పట్నాలు(చిన్నపట్నం, పెద్ద పట్నం) వేస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నపట్నం ఒక్కరోజే ముగుస్తుందని, పెద్ద పట్నమైతే ఐదురోజులు నిర్వహిస్తామని యాదవ రాజులు చెబుతున్నారు. పెద్దపట్నం వేసుకునేవారి ఇళ్లలో మల్లన్న దేవుడి పెళ్లిసందడి కనిస్తుంది. పుట్ట బంగారం తీసుకురావడంతో మల్లన్న పట్నాల సందడి మొదలవుతుంది. ఒడువాల బియ్యంతో పోలుపోసిన తర్వాత మైలలు తీసే కార్యక్రమం జరుగుతుంది. ఆతర్వాత మల్లన్నకు అభిషేకం, స్నానం చేయించి పోలుమీదికి తీసుకురావడంతో కార్యక్రమం ముగుస్తుంది. మరుసటిరోజు ఉదయం పసుపు,కుంకుమ, ఒడిబియ్యంతో మల్లన్న పట్నాల చుట్టూ తిరుగుతూ నాగవెల్లి కార్యక్రమం నిర్వహించి మల్లన్న పట్నాలను ముగిస్తారు. గజ్జెల్లాగులతో పోలుతొక్కించి శివసత్తుల ఊరేగింపుతో గ్రామాల్లో సందడి ఉంటుంది.

- వెంకటాపూర్, ఆంధ్రజ్యోతి

పచ్చని చిలుకలు తోడుంటే..

క్లిక్ క్లిక్



పంటలు.. పశుపక్షాదుల ప్రకృతి అనుబంధం అంతాఇంతా కాదు. సూర్యోదయమైనా.. సూర్యాస్తమయ సమయమైనా పక్షుల కిలకిలారావాలతో పల్లెలు పరవశిస్తాయి. పొలాల్లో సంచరించే పిచ్చులు, కొంగలు తదితర పక్షులు కనులవిందు చేస్తుంటాయి. వాటిలో రామచిలుకలదైతే ప్రత్యేక స్థానం. వాటి పెంపుడు పక్షిగానే కాకుండా సాక్షాత్తూ ఆ సీతారామచంద్రస్వామి స్వరూపంగా భావిస్తారు. అలాంటి రామచిలుకల సమూహం ఇదిగో ఇలా రైతుకు తాము తోడున్నామన్నట్టుగా.. ఓ కల్లం వద్ద రాసిగా పోసిన ధాన్యంపై వాలి సందడిచేశాయి. అంతేకాదు ఆ వడ్లను బుక్కుతూ కనిపించాయి. ఈ సందర్భంలో ఆరుగాలం శ్రమించిన ఆ రైతు కూడా వాటిని చూసి మురిసిపోతూ తాను పడిన కష్టాన్ని మరిచిపోయాడు. వరంగల్ జిల్లా ఎలుకుర్తిలో బుధవారం కనిపించిందీ దృశ్యం.



ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

వడ్డెపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి శివారులోని చెరువుకట్ట శివాలయం వద్ద గల ఉమారామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురుస్వాములు శ్రీకాంత్, హరిమహేందర్, ఆకుల మధు ఆధ్వర్యంలో పురోహితుడు ప్రవీణ్‌శర్మ పర్యవేక్షణలో అయ్యప్పస్వామి పడి పూజను బుధవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, మాజీ కార్పొరేటర్ విజయ్ భాస్కర్, కార్పొ రేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ తదితరులతో పాటు అయ్యప్ప భక్తులు అనుమాల శ్రీకాంత్, బోయినపల్లి సాయి తదితరులు స్వామిని భక్తి ప్రపత్తులతో కొలిచారు.



పడిపూజలో పాల్గొన్న స్వాములు

ఖండాంతరాలు దాటిన ప్రేమ

ఇటలీ అమ్మాయితో వరంగల్ అబ్బాయికి పెళ్లి



దేశాయిపేటలో వివాహం చేసుకున్న జంట

పోచమ్మమైదాన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వారు ప్రేమకు ఎల్లలు లేవని నిరూపించారు. ఖండాంతరాలు దాటిన ప్రేమకు మూడుముళ్లు వేసి ఒక్కటయ్యారు. వరంగల్ దేశాయిపేట ఒయాసిస్ కాలనీకి చెందిన కొడిపాక సదానందం - ప్రసన్నరాణి దంపతుల కుమారుడు సూర్యప్రీతం కొన్నేళ్ల కిందట ఉన్నత విద్యకోసం లండన్ వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. ఈ క్రమంలో అక్కడ ఇటలీ దేశానికి చెందిన జెన్నిపేటలోని - మోనికపేటలోని దంపతుల కుమార్తె మార్తపేటలోనితో ప్రేమలో పడ్డాడు. ఇద్దరు కలిసి ఇరు కుటుంబాల పెద్దలను ఒప్పించారు. బుధవారం దేశాయిపేటలోని సీఎస్ఐ చర్చిలో కుటుంబ సభ్యుల సమక్షంలో వైభవంగా వివాహం చేసుకున్నారు.

రైల్వే బోర్డుపై ఉండే.. 'ఎంఎస్ఎల్+' అంటే..!


మీకు తెలుసా?

ప్రతీ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంకు రెండు చివరలా ఊరును తెలిపే బోర్డులు ఉంటాయి. వాటిపై 'ఎంఎస్ఎల్+' అనే అక్షరాలతో పాటు ఒక నెంబరు రాసి ఉంటుంది. అసలు ఈ ఎంఎస్ఎల్+ అంటే ఏంటనే విషయాన్ని ఎవరూ పట్టించుకోరు. అయితే 'మీన్ సీ లెవల్'(సగటు సముద్ర మట్టం) పదాలకు సంక్షిప్త రూపమే ఎంఎస్ఎల్. ఇక '+' అనేది సముద్ర మట్టానికి ఎత్తులో ఉన్నదని సూచిస్తుంది. సదరు రైల్వే స్టేషన్ సముద్ర మట్టానికి ఎంతఎత్తులో ఉందనేది మీటర్లలో చూపుతుంది. ఉదాహరణకు కేసముద్రం రైల్వేస్టేషన్ బోర్డుపై 'ఎంఎస్ఎల్+218.34ఎం' అని ఉంటుంది. అంటే ఈ రైల్వేస్టేషన్ సముద్రమట్టానికి 218.34 మీటర్ల ఎత్తులో ఉందన్న మాట. రైల్వే సిబ్బందికి సాంకేతికంగా రైలు నడపడంలో ఈ సమాచారం ఉపయోగపడుతుంది. అంతేకాకుండా ప్రయాణికులకు ఈ సంఖ్య భౌగోళిక అవగాహనను కల్పిస్తుంది. సముద్రతీర ప్రాంతాల్లో ఉన్న రైల్వేస్టేషన్ల వద్ద బోర్డులపై +5, +10మీటర్లే ఉంటుంది. తుఫానులు, వరదలు వచ్చిన సమయంలో ఆయా ప్రాంతాల్లో ఈ సమాచారం ఎంతో కీలకంగా మారుతుంది.



- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

రహస్యాల భద్రకాళి



సిద్ధులగుట్టపై నాటి అడుగుల ఆనవాళ్లను చూపిస్తున్న చరిత్రకారుడు రత్నాకర్‌రెడ్డి

- చెరువు కేంద్రంగా ఎన్నో రహస్యాలు
- డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి

ఆనవాళ్లు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువు నీటిని ఖాళీ చేయడంతో పరిశోధకుల దృష్టి భద్రకాళి చెరువుతో పాటు చెరువు చుట్టు అల్లుకుని ఉన్న గుట్టలపై పడింది. ఈ నేపథ్యంలో చారిత్రాత్మక భద్రకాళి చెరువు కేంద్రంగా ఎన్నో రహస్యాలు దాగి ఉన్నాయని, నగర ప్రజలు గతంలో ఎన్నడూ ఎరుగని అద్భుతాలు చూస్తారని డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రత్నాకర్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా ఆసక్తికర విషయాలను బుధవారం వెల్లడించారు.

● వేలాది ఏళ్లుగా ఆదిమానవులు, రాజవంశీయులు, ఆధ్యాత్మికపరులు మొదలుకుని నేటి ఆధునిక మానవులను భద్రకాళి చెరువు, చుట్టూ ఉన్న గుట్టలు ఆకర్షిస్తున్నాయి భద్రకాళి చెరువు అంచున ఆదిమానవులు జీవించిన గుహలు, చెరువు మధ్యలో ద్వీపంలా ఉండే గుట్టపై రాతి పనిముట్ల పరిశ్రమ, బృహత్ శిలాయుగం నాటి సమాధులు, కాకతీయుల నాటి సైనికుల కోట వెనుక నుంచి రహస్య మార్గం, ఆ మార్గం నుంచి చెరువులోకి దిగడానికి వీలుగా ఉన్న మెట్ల మార్గాన్ని ప్రతాప్ హేమంతులతో కలిసి నూతన చారిత్రక ఆధారాలను గతంలోనే గుర్తించారు.

● హనుమద్గిరి తటాకాంజనేయస్వామి దేవాలయం వెనుక నుంచి చెరువులోకి దిగితే రెండు శిలలపై చెరువు ముఖంగా శిల్పకళ ఉట్టిపడే విధంగా రాష్ట్రకూటుల కాలం నాటి వినాయకులు, చాముండీదేవి శిల్పాలు, రైలింగ్ మధ్యలో ఉన్న శివలింగాలు, నందివిగ్రహాలు, సూర్యుడి శిల్పాలు కనిపిస్తాయి.



సిద్ధుల గుట్టలో చిన్నపాటి బండరాళ్లపై ఉన్న పరుపుబండ

● ఈ శిల్పాలపై భాగంలో విశాలమైన ఒక గుహ ఉంది. ఈ గుహలో 12000 సంవత్సరం నుంచి 2000 సంవత్సరం మధ్యకాలంలో ఆదిమానవులు తలదాచుకున్నట్టు తెలుస్తోంది. గుహలోపల పెద్ద పెద్ద ఇటుకలు ఉండడంతో ఈ గుహలో సిద్ధులు లేదా రుషులు నివసించేవారని చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి.

● గుహ ముందు భాగంగా కోడిగుడ్డు ఆకృతిలో ఉన్న రెండు గ్రూవ్స్ ఉన్నాయి.



బ్రాహ్మణవాడ సమీపంలో గుట్టపై తొలిచిన బద్దలు



గుట్ట ఎక్కడానికి తొలిచిన మెట్లు

● గుహ ముందు నుంచి గుట్ట చివరి అంచు నిర్మించబడిన కోట గోడలు కనిపిస్తాయి. ఇక్కడ కుడి వైపు నుంచి కాకతీయుల పాలకులు నిర్మించిన కోట లోపలి వైపు వెళ్లడానికి రహస్య మార్గం ఉంది. ఈ మార్గం గుండా సైనికులు చెరువులోకి దిగి స్నానాలు చేసి దాహార్తిని తీర్చుకోవడానికి వీలుగా శిలకు తొలిచిన మెట్లు ఉన్నాయి.

● చెరువు వైపు దిగువన ఏటవాలుగా ఉన్న శిలపై ఆలయం నిర్మించే ప్రయత్నాలు చేసినట్టు తొలిచిన పునాదులు సాక్ష్యంగా ఉన్నాయి.

● ఈ ఆలయ రాతి పునాదుల పక్కన శిలకు అసంపూర్ణంగా చెక్కిన భైరవ శిల్పం ఉంది.

● సిద్ధుల గుట్ట వెనుక వైపు భద్రకాళి చెరువు మధ్యలో ద్వీపంలా ఉన్న గుట్టపై నవీన శిలాయుగం నాటి ఆదిమానవులు రాతి పనిముట్లను తయారు చేసుకున్న పరిశ్రమ ఉంది. యాభైకి పైగా గ్రూవ్స్ (పొడవైన బద్దలు) ఉన్నాయి.

● గుట్ట పూర్తి ఉపరితలంలో సమతల ప్రదేశంలో బృహద్ శిలాయుగం నాటి డాల్మెన్ సమాధి ఉంది. చెరువులో రాక్షస గూళ్లను పురావస్తు శాఖ గతంలో గుర్తించింది. పురావస్తు శాఖ సమగ్ర పరిశోధన చేస్తే భద్రకాళి చెరువు, చెరువు చుట్టూ ఉన్న గుట్టలు పర్యాటకులను మరింత విశేషంగా ఆకట్టుకుంటాయని రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు.

సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేలా బోధన చేయాలి

● డీఈవో రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేలా బోధన చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం తెలంగాణ బయోసైన్స్ ఫెడరేషన్(టీబీఎస్ఎఫ్) మహబూబాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. వచ్చే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో పరీక్షకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10/10 జీపీఏ ఎక్కువ మంది విద్యార్థులు సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోటీల్లో ఇంగ్లీష్ మీడియంలో దంతాలపల్లి పాఠశాల విద్యార్థిని బి. జ్యోత్స్న ప్రథమ, గూడూరు జడ్పీహెచ్ఎస్



జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసి, అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

బాలుర విద్యార్థి దేవేందర్ ద్వితీయ స్థానాల్లో నిలువగా, తెలుగు మీడియంలో మహబూబాబాద్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినీ జి. సంగీత ప్రథమ, మరిపెడ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సోనియా ద్వితీయ స్థానాల్లో నిలువగా వారికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం డీఈవోని సన్మానించారు. టీబీఎస్ఎఫ్‌జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హాస్సేన్, శ్రీధర్, డీఎస్వో అప్పారావు, ప్రిన్సిపాల్ జాక్లీన్, ఫెడరేషన్ బాధ్యులు రామ్మోహన్, విష్ణువర్ధన్, భాస్కర్, సునిత, సోమేశ్వర్, నవీన్, హరిశంకర్, జనార్దన్ పాల్గొన్నారు.

వృద్ధులను కాపాడుకోవాలి

సీరోలు : జీవితంలో ఎన్నో కష్టసుఖాలను అధిగమించి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మన్నెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు ఇందిరరాణి, శ్రీధర్, ప్రశాంతి, విక్టోరియా, మాధవి, నాగరాజు, లక్ష్మీనర్సయ్య ఆర్థిక సహాయంతో దుప్పట్లను సమకూర్చారు. ఈ సందర్భంగా డీఈవో చేతుల మీదుగా నిరుపేద వృద్ధులకు అందజేశారు. డీఎస్వో అప్పారావు, ఏఈవోలు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు



ఖాళీ కుర్చీకి వినతి పత్రం అందిస్తున్న జాటోత్ సురేష్

సమయపాలన పాటించని అధికారులు

● ఇబ్బందులు పడుతున్న తొర్రూరు మండల ప్రజలు

తొర్రూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు సమయపాలన పాటించక పోవడంతో కార్యాలయాలకు వచ్చే లబ్ధిదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం తొర్రూరులోని ఎంపీడీవో కార్యాలయానికి ఉదయం 11 గంటలు దాటినా ఏ ఒక్క అధికారి, సిబ్బంది కార్యాలయానికి హాజరు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని అరిపిరాల శివారు అమర్‌సింగ్ తండాకు చెందిన జాటోత్ సురేష్ ఈజీఎస్ పనుల నిమిత్తం కార్యాలయానికి రాగా అధికారులు ఎవరూ లేరు. వెంటనే సంబంధిత ఈజీఎస్ ఏపీవోకు ఫోన్ చేయగా తాను ఫీల్డ్ విజిట్‌లో ఉన్నానని తెలిపాడు. ఈజీఎస్‌లో పనిచేసే టెక్నికల్ అసిస్టెంట్‌లు కూడా కార్యాలయానికి హాజరుకాలేదు. ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ కూడా హాజరుకాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై ఎంపీడీవో కార్యాలయ అధికారులను వివరణ కోరగా.. ఉద్యోగులు కొందరు ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఉన్నట్లు తెలిపారు.

ఈజీఎస్ సిబ్బందిని బదిలీ చేయాలి

జాటోత్ సురేష్, అమర్‌సింగ్ తండా

తొర్రూరు మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని బదిలీ చేయాలి. గ్రామాల్లో ఈజీఎస్‌లో పనిచేసిన బిల్లులు, కూలీల డబ్బులు చెల్లించేందుకు అధికారులు లంచాలు ముడితేనే పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధి హామీలో ప్రజలకు ఉపయోగపడే అనేక పథకాలున్నా, అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు అందడం లేదు. 29 గ్రామ పంచాయతీల్లో హార్టికల్చర్, సెరికల్చర్ పశువుల పాకల కోసం గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేసి దరఖాస్తులు చేసుకున్నా నేటి వరకు ఒక్క లబ్ధిదారుడికి కూడా పూర్తిస్థాయిలో రుణాలు అందించలేదన్నారు. తాను గతనెల రోజులుగా పశువుల పాక మంజూరు కోసం పంచాయతీ తీర్మానం కాపీతో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టిం చుకోవడంలేదని, సంబంధిత అధికారులు స్పందించి ఈజీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయంలో ఎవరు లేకపోవడంతో కుర్చీకి వినతిపత్రం అందించారు.

‘రైతుల పంట రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ చేయాలి’

కురవి, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి) : రైతుల పంట రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని సీపీఎం, కేవీపీఎస్, గిరిజన సంఘం నాయకులు మలేడి కోటయ్య, దుడ్డెల రాంమ్మూర్తి, మాలోతు కిషన్, సయ్యద్ ఖాజా డిమాండ్ చేశారు. కురవిలో తన పంట రుణమాఫీ కోసం దీక్ష చేస్తున్న రైతు సహదేవ్‌కు 4వ రోజు ఆయా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2 లక్షల లోపు రుణాలు ఉన్న రైతులందరికి మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లపు సుధాకర్, కట్ల కృష్ణ, చేపూరి గణేష్, అరూరి శ్రీను, పాల్వాయి యాదగిరి, షేక్.యాకూబ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి) : పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య అన్నారు. మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాదం భవనంలో బుధవారం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 36వ వార్డులో కమిటీలు వేసి, సమస్యల అధ్యయనానికి ఇంటింటికి సీపీఎం కార్యక్రమం చేపట్టగా ప్రజల నుంచి అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.నాయకులు సూర్నపు సోమయ్య, బానోతు సీతారాంనాయక్, రావుల రాజు, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, చింపిరి యాకయ్య, బానోతు వెంకన్న, హేమానాయక్, కుమ్మరికుంట్ల నాగన్న, చాగంటి భాగ్యమ్మ, నక్క సైదులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌళిక సదుపాయాలుకల్పించాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐకేఎస్) మహబూబాబాద్ జిల్లాప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి, ఈదులపూసపల్లి కొనుగోలు కేంద్రాల్లో బుధవారం సందర్శించారు. శంకరయ్య, వెంకన్న, పెంటయ్య, ఐలయ్య, లింగన్న, వేణురెడ్డి, ప్రసాద్, సునీత, పద్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో విజయం సాధించాలి : బీజేపీ

తొర్రూరు, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేందుకు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాం మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తొర్రూరులో బీజేపీ బూత్ కమిటీల నియామక ప్రక్రియ ప్రారంభించి, మాట్లాడారు. బీజేపీ ప్రజాస్వామిక బద్ధంగా పార్టీ రాజ్యాంగానుసారంగా మూడేళ్లకోసారి సంస్థాగత ఎన్నికలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. బూత్ కమిటీల నిర్మాణం పకడ్బందీగా పూర్తిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం కోసం ఉపయోగపడేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. బొమ్మరాతి రాజ్‌కుమార్, నర్కుటి చలపతిలను బూత్ కమిటీ అధ్యక్షులుగా నియమించారు. నాయకులు పల్లె కుమార్, ఎం.యాకయ్య, సోమన్న, ఆర్. కుమార్, రాంబాబు, రాజేష్, నవీన్, రాజ్‌కుమార్, శ్రీనాథ్, శివ తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలి



డోర్నకల్‌లో బూత్ కన్వీనర్లకు నియామకపత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

కురవి (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ కురవి మండల సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి చీకటి మహేష్‌గౌడ్ అన్నారు. కురవి మండలంలోని రాయినిపట్నం, లింగ్యాతండాలకు బూత్‌స్థాయి అధ్యక్షుల నియామకాన్ని బుధవారం చేపట్టారు. లింగ్యాతండా అధ్యక్షుడిగా లావుడ్యా రమేష్, రాయినిపట్నం అధ్యక్షుడిగా కోల వెంకన్నగౌడ్‌లను నియమించారు. ఈ సందర్భంగా మహేష్‌గౌడ్ మాట్లాడుతూ కార్యకర్తలు బీజేపీ విస్తరణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎస్వీఎన్.రాజు, రాష్ట్ర కౌన్సిల్‌మెంబర్ కొంతం పెంటయ్య, సోమ రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత

డోర్నకల్ (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు అన్నారు. డోర్నకల్‌లో బీజేపీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బూత్ కన్వీనర్లకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గణేష్‌నాయక్, టౌన్ పార్టీ అధ్యక్షుడు దేవాసింగ్, నాయకులు రెహమాన్, జయరాజ్, హన్మంతు, సుమన్, రవి, అశోక్, రాము పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ధాన్యాన్ని తరలించాలి

● ఆర్డీవో కృష్ణవేణి

డోర్నకల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో కాంటాలైన ధాన్యాన్ని వెంటనే ఆయా రైస్‌మిల్లులకు తరలించాలని మహబూబాబాద్ ఆర్డీవో కృష్ణవేణి నిర్వాహకులకు సూచించారు. డోర్నకల్‌లోని తహసీల్దార్ బంజరలోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో వడ్లు భారీగా ఉండడంతో వెంటనే ధాన్యం తరలించేందుకు లారీలను సమకూర్చాలని నిర్వాహకులు ఆర్డీవో వద్ద విన్నవించారు. అనంతరం కొనుగోలు కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు.కొనుగోలు కేంద్రం నిర్వాహకులు హరీష్, వీరలక్ష్మి, మల్లీశ్వరి, మణెమ్మ పాల్గొన్నారు.

‘ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి’

బయ్యారం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముంది ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని తక్షణమే అమలు పర్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మండా రాజన్న డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం బుధవారం స్థానిక తహసీల్దార్ విజయకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు పర్చడంలో విఫలమైందని ఆరోపించారు. నాయకులు మధు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గార్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) ఎంపీ పోరిక బలరాంనాయక్ సిఫార్సు మేరకు మంజూరైన రూ.50 వేలకు గాను ముగ్గురు లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజలు కార్పొరేట్ వైద్య కోసం ప్రభుత్వం వేలకోట్లు రూపాయలు బడ్జెట్‌లో కేటాయించడం జరిగిందన్నారు. సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు వరం లాంటిదన్నారు.

‘సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి’

కురవి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సామాజిక భద్రత లేని సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీపీసీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు పూసపాటి నాగముని డిమాండ్ చేశారు. డిసెంబర్ 22న వరంగల్‌లో జరిగే కాకతీయ కథన భేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అవునూరి రవి, సారంగపాణి, వంగ సురేష్, దామోదర్ పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు ఎంపికలు

డోర్నకల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్‌కేంద్రంలోని బ్రిలియంట్ పాఠశాలలో సీఎం కప్‌లో పోటీల్లో భాగంగా ఈ నెల 20న వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ కార్యదర్శి మండలోజు సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, పదో తరగతి మెమోలతో హాజరు కావాలన్నారు. వెయిట్ లిఫ్టింగ్‌కు వయస్సు 20 సంవత్సరాల్లోపు, పవర్‌లిఫ్టింగ్‌కు 23 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు.

టిప్పర్లపై చర్య తీసుకోవాలి

కేసముద్రం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ అంబేద్కర్ సెంటర్ నుంచి కేసముద్రం విలేజిదర్గా వరకు నిత్యం దుమ్ములేపుతున్న మట్టి, కంకర టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ జిల్లా కమిటీ సభ్యులు మర్రిపెల్లి మొగిళి, జాటోత్ బిచ్యానాయక్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. రోడ్డుపై దుమ్ము లేవకుండా నీళ్లు చల్లాల్సిన కాంట్రాక్టరు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు.

‘టెన్త్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి’

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ అన్నారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బుధవారం తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయని, విద్యార్థినులను ప్రతీరోజు పాఠశాలకు పంపించాలన్నారు. పాఠశాలలో ఉదయం, సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్‌లో విద్యార్థినులకు ఏమైనా సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరైన ప్రతీ విద్యార్థినీ ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10/10 జీపీఏ ఎక్కువ మంది విద్యార్థినులు సాధించే విధంగాప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సమావేశంలో హెచ్ఎం అరుద్ర వెంకటేశ్వర్లు, వందేమాతరం ఫౌండేషన్



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్

బాధ్యులు వెంకటష్, దేవేంద్రమ్మ, ఉపాధ్యాయులు గిరిజ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం వెళ్లితే ఖాళీగా ఉన్న పీహెచ్‌సీ

కేసముద్రం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాలికి గాయంకాగా చికిత్సకోసమని కేసముద్రం పీహెచ్‌సీకి బుధవారం సాయంత్రం మూడు గంటలకు వెళ్లగా వైదసిబ్బంది ఎవరూలేరని సీపీఎం మండల కమిటీ సభ్యుడు నీరుటి జలేందర్ ఆరోపించారు. వైద్యాధికారి, మందులగది, ల్యాబ్ అన్ని గదులకు తాళాలు వేసి ఉన్నాయని తెలిపారు. పేదలకు ఎంతో అవసరమయ్యే ప్రభుత్వ ఆస్పత్రిలో కనీసం ప్రాథమిక చికిత్స అందించేందుకు సైతం ఎవరూ లేకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని వైద్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పీహెచ్‌సీ డాక్టర్ నంబీకిషోర్‌ను వివరణ కోరగా ఓపీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే ఉంటుందని, స్టాఫ్‌నర్స్, ఫార్మాసిస్ట్‌లు మెడికల్ లీవ్‌పై కొద్దినెలల క్రితమే వెళ్లారని తెలిపారు. మిగిలిన ఏఎన్ఎంలు బుధవారం కావడంతో టీకాలు వేసేందుకు వెళ్లినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నీరుటి జలేందర్

దళిత కాలనీలో పట్టాలిచ్చారు.. భూములు మరిచారు : సీపీఎం

మరిపెడ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వీరారం దళిత కాలనీలో గత ప్రభుత్వాలు పట్టాలిచ్చినప్పటికీ భూములు ఇవ్వలేదని, ఆ లబ్ధిదారులకు వెంటనే భూములు ఇవ్వాలని సీపీఎం మండల నాయకుడు బాణాల రాజన్న డిమాండ్ చేశారు. బుధవారం వీరారంలోనే దళితకాలనీలో ఉంటున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సీపీఎం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1973 సంవత్సరం భూగరిష్ట పరిమితి చట్టంలో మిగులు భూమిని గుర్తించి 1992 లో 40 మంది కుటుంబాలకు సర్వే నెంబర్ 253, 305లో 67 ఎకరాల అసైన్డ్ భూమి చేసి దళితులకు పట్టాలిచ్చారు. కానీ, భూమి మాత్రం ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో గంట భద్రయ్య, నాగయ్య, ఏర్పుల రవి, పుల్లయ్య, గుండె వీరయ్య బాషిపంగు వెంకన్న, మల్లయ్య, వెంకన్న, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

గొల్లకురుమల సమస్యలపై చర్చించాలి : జీఎంపీఎస్

తొర్రూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో గొల్లకురుమల సమస్యలపై తక్షణమే చర్చించాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కంఠాయపాలెం గ్రామ సొసైటీ అధ్యక్షుడు కొండ వెంకన్న ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి ఆయన మాట్లాడుతూ గొల్ల, కురుమల సమస్యల సాధన కోసం నేడు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కారం కావాలంటే అందరు తరలిరావాలని కోరారు. సంఘం నాయకులు ఆమడగాని యాకయ్య, కొండ బిక్షం, కొండ రాము, లక్ష్మణ్, యాకన్న, కుమారస్వామి, రాజ్ కుమార్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

● సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్

తొర్రూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ అన్నారు. బుధవారం గుర్తూర్, జమస్థాన్‌పురం గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం ఆరు గ్యారెంటీలు అంటూ వచ్చిన ఇప్పటి వరకు ఒక హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో గుద్దేటి సాయిమల్లు, ఉమ్మగాని యాకయ్య, మర్క సుధాకర్, కొత్త వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా

● మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : పాలకుర్తి నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపా డుకుంటామని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం ఎడమటితండా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధరవత్ బీర్యానాయక్ (75) మరణించగా, మృతదేహానికి చిత్ర పటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు అనంతరం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. బీర్య మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదరు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి.రామచంద్రయ్యశర్మ, శ్రీరాం సుధీర్, సంజయ్, విజయ్‌పాల్‌రెడ్డి, బుజ్జమ్మ, ధరవత్ రాజేందర్, హరీష్, రమేష్, శంకర్ పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు



ఇరుముడిలతో శబరిమలకు పయనమైన అయ్యప్పలు, పాల్గొన్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి

పెద్దవంగర, డిసెంబర్18 (ఆంధ్రజ్యోతి) : బొమ్మకల్ గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు శబరిమలకు పయనమయ్యారు. బుధవారం పెద్దవంగరలోని హనుమాన్ ఆలయంలో గురుస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడి కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, మాట్లాడారు. అనంతరం ఆయ్యప్ప మాలదారులు, భక్తులు తీర్థ ప్రసాదాలు, భిక్ష ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, సీనియర్ నాయకుడు జాటోతు నెహ్రూనాయక్, ఇన్‌చార్జి విజయ్‌పాల్‌రెడ్డి, పూర్ణచందర్, క్రాంతికు మార్, బీసు హరికృష్ణ, సతీష్, రాజేష్‌కుమార్, శ్రీనివాస్, సీతారామ్‌నాయక్, వెంకన్న, యాకన్న, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

పట్టుదలతో విద్యనభ్యసించాలి

తొర్రూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పట్టుదలతో విద్యను అభ్యసించాలని ఎంఈవో బుచ్చయ్య, గణిత ఉపాధ్యాయుడు అట్లూరి నర్సింహమూర్తి అన్నారు. బుధవారం జాతీయ గణిత దినోత్సవ సందర్భంగా తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి వారు మాట్లాడారు.హెచ్ఎం లక్ష్మీనారాయణ, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అనిల్ కుమార్, లింగమూర్తి, జావిద్, షహనాజ్ బేగం, కవిత, రాణి, జ్యోతి, రేణుక, అశోక్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని తండ్రికి అప్పగించిన పోలీసులు

మరిపెడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మునిసిపల్ సేవానగర్‌కు చెందిన భూక్యా వెంకన్న కుమారుడు కార్తీక్ స్థానిక సీతారాంపూర్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం తర్వాత ఆ బాలుడు స్కూల్ నుంచి ఇంటికి వచ్చే క్రమంలో ఇళ్లు దొరకక స్థానిక వైరటీ చికెన్ సెంటర్ ముందు ఏడుస్తూ నిలబడ్డాడు. ఆ చికెన్‌సెంటర్ యజమాని ఆ బాలుడిని ఓదార్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాట్సప్ గ్రూపుల్లో ఈ విషయం వైరల్ కావడంతో తండ్రి తమ కుమారుడేనని గుర్తించి, పోలీసులను ఆశ్రయించి బాలుడిని ఇంటికి తీసుకెళ్లారు.



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

కాంగ్రెస్‌తోనే పేదలకు పథకాలు

మరిపెడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయని ఆ పార్టీ మరిపెడ పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్ అన్నారు. బుధవారం మునిసిపాలిటీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆయా కాలనీల ప్రజలతో ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదలు సర్వే అధికారులకు సహకరిస్తూ వివరాలు తెలపాలని కోరారు. ఆయన వెంట 9వ వార్డు కౌన్సిలర్ ప్రగతిశ్రీపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అప్సర్, అక్బర్, రవికాంత్, సురేశ్ ఉన్నారు.

‘ధరల పట్టికను ప్రదర్శించాలి’

నెహ్రూసెంటర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆరోగ్యశాఖ నిబంధనలు పాటిస్తూ ప్రతీ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు ధరల పట్టికను స్కానింగ్ సెంటర్ల ముందు ప్రదర్శించాలని మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం అన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్ష నేరమని, ఎవరైన లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే శిక్షార్హులవుతారని చెప్పారు. ప్రతినెల 5 లోపు పీసీపీఎన్‌డీపీఎ దరఖాస్తులు జిల్లా కార్యాలయానికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీ రాజు, అరుణ్‌కుమార్ ఉన్నారు.

వృద్ధురాలికి ఆసరాగా సీఎస్ఆర్ఎంవో

నెహ్రూసెంటర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైద్యం కోసం ప్రభుత్వ జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చిన ఓ వృద్ధురాలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవో జగదీశ్వర్ దగ్గరకు తీసుకుని ఆక్కున చేర్చుకుని ఆర్థిక పరిస్థితులు, అనారోగ్యానికి గురైన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమెకు కావాల్సిన నెలకు సరిపడ మందులను రూ.500 ఆర్థిక సాయంగా అందించారు. జగదీశ్వర్ సాయం చేయడం అభినందనీయమని పలువురు కొనియాడారు.



టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహాసభలను జయప్రదం చేయండి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని సంఘం భవనంలో బుధవారం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో జరిగే రాష్ట్ర6వ విద్యావైజ్ఞానిక మహాసభలలో రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితులు-ప్రభుత్వ విద్యారంగబలోపేతానికి, విద్యారంగసమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల సమస్యలు మొదలగు విషయాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథులుగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుకేందర్‌రెడ్డి, రోడ్డు భవనాల, సినిమాటోగ్రఫీశాఖ మాత్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, పాఠశాల విద్యడైరెక్టర్ నర్సింహారెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ యాకూబ్, స్వప్న, నాగమల్లయ్య, వివేక్, మంజుల, హుస్సేన్, రమేష్, హరినాయక్ పాల్గొన్నారు.

మతతత్వ విధానాలతో పాలన

కేసముద్రం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలతో పాలన సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆరోపించారు. మండలంలోని అమీనాపురంలో ఆ పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం బుధవారం కాసు సాయిచరణ్ అధ్యక్షతన నిర్వహించారు. మహబూబాబాద్ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయసారథిరెడ్డి, మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మంద భాస్కర్, కముటం ఉపేందర్, గుండెల కొమురయ్య, గుండు సోమయ్య, అందె గురవయ్య మండ శ్రీను, మడత నారాయణ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ 27వ వార్డులో రూ.5 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం స్థానిక వార్డు కౌన్సిలర్, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఫరీద్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు నాగమల్లు, ఉప్పలయ్య, రమణ, లక్ష్మణ్, బొడ్డుపల్లి శ్రీనివాస్, దేశబోయిన వెంకటస్వామి, విజయ్, వీరన్న, దుగ్గి రాంగోపాల్, కార్తీక్, సంతోష్, మహ్మద్ రెహ్మాన్, లక్ష్మణ్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.